# విశాల భారతి

27-01-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 25




# కన్నులపండువగా గణతంత్ర దినోత్సవం

గణతంత్ర దినోత్సవ వేడుకలు ఢిల్లీలో అంబరాన్నంటాయి

- భారత్ సార్వభౌమత్వాన్ని, సైనిక సామర్థ్యాన్ని చాటిచెప్పింది
- ఢిల్లీ వీధులన్నీ దేశభక్తి నినాదాలతో మారుమోగాయి
- ఆధునిక యుద్ధ తంత్రాల ప్రదర్శనతో ఆకర్షణీయంగా నిలిచాయి
- రాష్ట్రపతి పతాకావిష్కరణ అనంతరం గాల్లోకి ఎగిరిన త్రివర్ణ బెలూన్లు
- దేశ రక్షణ వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందో కళ్లకు కట్టినట్లు చూపింది

03





# సంతోష్‌పై గురిపెట్టిన సిట్

- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కీలక మలుపులు
- బీఆర్ఎస్ అగ్రనేతలకు ఉచ్చు బిగిస్తోంది
- సంతోష్ రావుకు సిట్ నోటీసులు
- జూబ్లీహిల్స్ పీఎస్‌లో విచారణకు రావాలని స్పష్టం
- ట్యాపింగ్ చేశారనే ఆరోపణలపై సిట్ లోతుగా దర్యాప్తు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు కీలక మలుపులు తిరుగుతోంది. ఈ కేసును తార్కిక ముగింపుకు తీసుకురావాలన్న పట్టుదలతో ఉన్న ప్రభుత్వం, దర్యాప్తును ముమ్మరం చేస్తూ బీఆర్ఎస్ అగ్రనేతలకు ఉచ్చు బిగిస్తోంది. ఇందులో భాగంగానే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మేనల్లుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ రావుకు ప్రత్యేక విచారణ బృందం నోటీసులు జారీ చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరుకావాలని అధికారులు ఆ నోటీసులో స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలు, చివరకు సొంత పార్టీ నేతల ఫోన్లను కూడా అక్రమంగా ట్యాపింగ్ చేశారనే ఆరోపణలపై సిట్ లోతుగా దర్యాప్తు చేస్తోంది. మొదట ఏర్పాటు చేసిన సిట్ దాదాపు ఏడాదిన్నర పాటు విచారణ జరిపినా ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేకపోయింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించి, సమర్థుడైన అధికారిగా పేరున్న హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ 2ను ఏర్పాటు చేశారు. ఈ కొత్త బృందం బాధ్యతలు

మిగతా 2లో..

## రాష్ట్రంలో అనుముల రాజ్యాంగం



- కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు
- రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగడంలేదన్నారు
- ప్రజాస్వామ్య విలువలు పతనమవుతున్నాయన్నారు
- రాజ్యాంగ విలువల సమాధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు
- జర్నలిస్టులను ఉగ్రవాదుల మాదిరిగా అరెస్ట్ చేస్తున్నారు
- 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ఆయన నిలదీశారు

03

# కొత్త లక్ష్యాలతో రైజింగ్ తెలంగాణ

- ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు
- మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- రైజింగ్ డాక్యుమెంట్ రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచి
- రాష్ట్రాన్ని గ్లోబల్ స్కిల్ హబ్‌గా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం
- రైతు సంక్షేమమే ధ్యేయంగా విప్లవాత్మక నిర్ణయాలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు తెలంగాణ రాష్ట్ర ప్రగతి ప్రస్థానానికి వేదికగా నిలిచాయి. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, సాయుధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, తెలంగాణ రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'రైజింగ్ తెలంగాణ 2047' పేరుతో రూపొందించిన సరికొత్త దార్శనిక పత్రం రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిగా మారుతుందని, హైదరాబాద్ గ్లోబల్ ఇమేజ్‌ను మరింత ఇనుమడింపజేస్తూ రాష్ట్రాన్ని మూడు కీలక ఆర్థిక జోన్లుగా విభజించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి 'గ్లోబల్ స్కిల్ హబ్'గా మార్చడమే ప్రస్తుత ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని గవర్నర్ స్పష్టం చేశారు. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే రాష్ట్రంలోని ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక కేంద్రాలుగా ఆధునీకరించినట్లు వివరించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే దాదాపు 62 వేల ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు భరోసా కల్పించిందని

మిగతా 2లో..



## కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి పార్టీలు

- బీజేపీ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు జెండాను ఆవిష్కరించారు
- రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంలో భాగస్వాములు కావాలన్నారు
- రాహుల్ గాంధీ వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు
- ఓటు చోరీ జరిగిందని అనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు
- పథకాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు

02

# కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైంది

- రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది
- ప్రొఫెసర్ కోదండరాం సంచలన వ్యాఖ్యలు చేశారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు
- ప్రజల నుంచి వస్తున్న స్పందనను గమనిస్తున్నామని స్పష్టం చేశారు
- ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాల్సిందని అభిప్రాయపడ్డారు
- సామాన్యుల సమస్యల విషయంలో కసరత్తు జరగాల్సిందన్నారు


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ముమ్మరం చేయడంతో ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోయాయి. ఏ క్షణమైనా నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందన్న ప్రచారంతో

మిగతా 3లో..



## బీజేపీ కుట్రలను అర్థం చేసుకోవాలి



- టీపీసీసీ అధ్యక్షుడు సంచలన వ్యాఖ్యలు చేశారు
- గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా మాట్లాడారు
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు
- పథకాలను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తున్నారన్నారు
- ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు

02

## జర్నలిస్టులకు మరో బిగ్ షాక్

- ప్రెస్ అనే పదం వాడకంపై కీలక నిర్ణయం
- మీడియా రంగంలో పెను సంచలనంగా మారింది
- అక్రిడిటేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులు రాసుకోవాలి
- ప్రెస్ స్టిక్కర్లు దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు
- గుర్తులను వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది




03

# కొత్త లక్ష్యాలతో రైజింగ్ తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని గవర్నర్ కొనియాడారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే ఉద్దేశంతో 'భూభారతి' చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలవడం గర్వకారణమని, రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ధాన్యానికి బోనస్‌గా రూ.1,780 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ముఖ్యంగా సన్నవడ్లకు క్వింటాల్‌కు రూ.500 అదనపు బోనస్ ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నామని, ఇప్పటికే 26 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి వారి కష్టాలను తీర్చిందని ఆయన వివరించారు. విద్య, వైద్య రంగాలను రాష్ట్ర ప్రభుత్వం రెండు కళ్లుగా భావిస్తోందని, ఈ రంగాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు గవర్నర్ వెల్లడించారు. నగరంలోని చారిత్రాత్మక ఉస్మానియా ఆస్పత్రి స్థానంలో 27 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో అత్యున్నత ప్రమాణాలతో కూడిన కొత్త ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు సమాన అవకాశాలు కల్పించేందుకు 'ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల' నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ప్రజారోగ్యం, విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరిచే క్రమంలో రాజీలేని పోరాటం చేస్తామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సామాజిక భద్రత, పేదల జీవన ప్రమాణాల పెంపుదలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని గవర్నర్ వివరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో నియోజకవర్గానికి 4.50 లక్షల చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఆహార భద్రతలో భాగంగా రాష్ట్రంలోని 1.30 కోట్ల కుటుంబాలకు ఉచితంగా




సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, దేశంలోనే రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన గర్వంగా ప్రకటించారు. ఇది పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న అంకితభావాన్ని చాటుతుందన్నారు. మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఇప్పటికే రూ.200 కోట్ల విలువైన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని పొందారని తెలిపారు. కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులకు వారిని యజమానులుగా మారుస్తున్నట్లు వివరించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రూ.40 వేల కోట్ల బ్యాంకు రుణాలు సమకూర్చడం ఒక చారిత్రాత్మక ముందడుగు అని ఆయన ప్రశంసించారు.

రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రహదారుల నెట్‌వర్క్‌ను పటిష్టం చేస్తున్నట్లు గవర్నర్ వెల్లడించారు. సుమారు 7,450 కిలోమీటర్ల మేర పంచాయతీ రోడ్ల అభివృద్ధి కోసం తొలిదశలో రూ.11,399 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే హ్యామ్ (HAM) విధానంలో 12 వేల కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని, ఇందులో భాగంగానే 'హిల్ట్ పాలసీ' ద్వారా కాలుష్య కారక పరిశ్రమలను నగర శివార్లకు తరలించే ప్రక్రియను వేగవంతం చేసినట్లు వివరించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, తెలంగాణ జీవనాడి అయిన బతుకమ్మ వేడుకలు గతేడాది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడం రాష్ట్ర ప్రతిష్టను పెంచిందని గవర్నర్ కొనియాడారు. మేడారం సమ్మక్కసారలమ్మ జాతర అభివృద్ధికి ప్రభుత్వం రూ.251 కోట్లు కేటాయించిందని, భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ.5 లక్షల బీమా పథకాన్ని అమలు చేస్తున్నామని, ఇది వారి కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచేందుకు రైతులకు 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరాను కొనసాగిస్తున్నట్లు గవర్నర్ స్పష్టం చేశారు. తెలంగాణను విత్తన భాండాగారంగానే కాకుండా, పారిశ్రామికంగా కూడా అగ్రపథంలో నిలిపేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. 'రైజింగ్ తెలంగాణ' డాక్యుమెంట్ ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడం ద్వారా 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గణతంత్ర వేడుకల సందర్భంగా అమర జవాన్లకు నివాళులర్పించిన గవర్నర్, దేశ రక్షణలో వారి త్యాగాలను స్మరించుకున్నారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పటిష్టమైన బందోబస్తు మధ్య వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నాయని, రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు**



**మునుగోడు, విశాలభారతి:** మునుగోడు మండల పరిధిలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. వాడవాడలా జెండా పండుగను తలపిస్తూ దేశభక్తి వాతావరణం నెలకొంది. పోలీస్ స్టేషన్‌లో హబీబుద్దీన్ ఏ.ఎస్.ఐ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో యుగేందర్ రెడ్డి , తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ నేలపట్ల నరేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అలాగే మండల పరిధిలోని ఆయా వార్డుల్లో గ్రామపంచాయతీలలో గ్రామ సర్పంచులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలు చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, ఉత్సాహంగా ముగిశాయి.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**విశాలభారతి, అడ్డ గూడూర్:** 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా సెయింట్ విన్సెంట్ పల్లోటి హైస్కూల్లో ప్రిన్సిపాల్ సెల్వి జాతీయ జెండా ఆవిష్కరించి ఘనంగా గణతంత్ర వేడుకలు నిర్వహించారు. అనంతరం అడ్డగూడూరు మండల కేంద్రంలో ప్రధాన కూడలిల వద్ద ర్యాలీ నిర్వహించి పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా డ్రగ్స్, మద్యపానం, ధూమపానం, సెల్ ఫోన్ ల వల్ల కలిగె అనర్థాలను వివరిస్తూ సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ్డగూడూరు ఎఎస్సై ఈశ్వర్, పోలీస్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, సెయింట్ విన్సెంట్ పల్లోటి హై స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సంతోష్‌పై గురిపెట్టిన సిట్

**మొదటిపేజీ తరువాయి**

చేపట్టిన వెంటనే విచారణలో వేగం పెంచి, కీలక ఆధారాలను సేకరించే పనిలో పడింది. సజ్జనార్ నేతృత్వంలోని సిట్ 2 ఇప్పటికే బీఆర్ఎస్ ముఖ్య నేతలను వరుసగా విచారిస్తోంది. గత కొన్ని రోజులుగా మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లను సిట్ అధికారులు ప్రశ్నించారు. వీరి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగానే ఇప్పుడు సంతోష్‌రావును విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ వెంటే ఉంటూ, పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ అనధికారికంగా చక్రం తిప్పిన సంతోష్‌రావుకు ఈ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్ర ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిఘా విభాగం అధికారులతో ఆయన నిరంతరం సంబంధాలు కలిగి ఉన్నారనే ఆరోపణలు విచారణలో కీలకం కానున్నాయి. కేసీఆర్‌కు నీడలా వ్యవహరించే సంతోష్ రావుకు ప్రభుత్వంలోని ప్రతి చిన్న విషయం తెలిసే అవకాశం ఉందని సిట్ భావిస్తోంది. ముఖ్యంగా కీలక సమాచార మార్పిడి, నిఘా వ్యవస్థల వినియోగంపై ఆయనకు పూర్తి అవగాహన ఉందనే కోణంలో అధికారులు ప్రశ్నవళిని సిద్ధం చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ అధికారులతో సంతోష్ రావు జరిపిన సంప్రదింపులు, వారి నుంచి సేకరించిన సమాచారం ఏ ప్రయోజనాల కోసం వాడారనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. విచారణలో ఆయన ఇచ్చే సమాధానాలు ఈ కేసులో తదుపరి చర్యలకు మార్గదర్శకంగా మారుతాయని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ అంతర్గత విభేదాలు కూడా ఈ కేసులో కొత్త కోణాలను ఆవిష్కరిస్తున్నాయి. పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత కల్వకుంట్ల కవిత చేసిన కొన్ని వ్యాఖ్యలు హరీష్ రావు, సంతోష్ రావులపైనే గురిపెట్టినట్లు ఉన్నాయి. ఫోన్ ట్యాపింగ్ వంటి సున్నితమైన అంశాలు సంతోష్‌రావుకు తెలియకుండా జరిగే అవకాశం



లేదని ఆమె అనుచరులు సైతం అంతర్గత చర్చల్లో అభిప్రాయపడుతున్నారు. పార్టీలోని కీలక సమాచారాన్ని సేకరించడానికి కూడా ఈ ట్యాపింగ్ యంత్రాంగాన్ని వాడుకున్నారనే అనుమానాలు ఇప్పుడు బలపడుతున్నాయి. సిట్ విచారణలో ఇప్పటికే కొందరు పోలీస్ అధికారులు అప్రూవర్లుగా మారినట్లు వార్తలు వస్తున్నాయి. వారు ఇచ్చిన వాంగ్మూలం సంతోష్ రావుకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. గతంలో నమోదైన స్టేట్‌మెంట్లలో కూడా సంతోష్ రావు పేరు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆయనను ప్రత్యక్షంగా విచారించి, ట్యాపింగ్ ఆర్డర్స్ ఎవరి దగ్గర నుంచి వచ్చాయి, ఆ డేటాను ఎక్కడ భద్రపరిచారు అనే విషయాలను రాబట్టాలని సజ్జనార్ బృందం ప్రణాళికలు రచిస్తోంది. ఈ కేసును కేవలం అధికారులకు పరిమితం చేయకుండా, దాని వెనుక ఉన్న రాజకీయ శక్తులను బయటకు తేవడమే సిట్ 2 లక్ష్యంగా కనిపిస్తోంది. ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఎన్నికల సమయంలో నిధుల సేకరణకు, ఇతర పార్టీల నేతలను బెదిరించడానికి వాడారనేది ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలపై సంతోష్ రావు ఇచ్చే వివరణ అత్యంత కీలకం కానుంది. ఒకవేళ ఆయన విచారణకు సహకరించకపోతే సిట్ తదుపరి ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే కేసీఆర్ కుటుంబ సభ్యులను ఈ కేసులో చుట్టుముట్టేందుకు ప్రభుత్వం గట్టి ఆధారాలనే సేకరించినట్లు కనిపిస్తోంది. వరుసగా అగ్ర నేతలకు నోటీసులు ఇవ్వడం, విచారణ జరపడం ద్వారా ఈ స్కామ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకునేందుకు రంగం సిద్ధమైంది. సంతోష్ రావును విచారించిన తర్వాత మరికొంతమంది కీలక వ్యక్తులకు కూడా నోటీసులు వచ్చే అవకాశం ఉందని సమాచారం. రాజకీయంగా ఇది బీఆర్ఎస్ పార్టీకి పెద్ద దెబ్బగానే పరిగణించవచ్చు.

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం మధ్యాహ్నం భారీ భద్రతను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. సంతోష్ రావు విచారణకు హాజరవుతారా లేక వ్యక్తిగత కారణాలతో గడువు కోరతారా అనేది వేచి చూడాలి. అయితే సిట్ అధికారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ విచారణను జాప్యం చేయకూడదనే పట్టుదలతో ఉన్నారు. సజ్జనార్ మార్క్ విచారణలో ఎటువంటి నిజాలు వెలుగులోకి వస్తాయనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మొత్తానికి ఫోన్ ట్యాపింగ్ కేసు ఒక కొలిక్కి వస్తున్నట్లు కనిపిస్తోంది. కొత్తగా ఏర్పాటైన సిట్ బృందం చూపిస్తున్న దూకుడు చూస్తుంటే, త్వరలోనే ఈ కేసులో మరిన్ని అరెస్టులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అక్రమ నిఘా నీడలో ఇన్నాళ్లూ సాగిన వ్యవహారాలన్నీ వెలుగులోకి వస్తే రాష్ట్ర రాజకీయాల్లో మరిన్ని సంచలనాలు నమోదు కావడం ఖాయంగా కనిపిస్తోంది. మంగళవారం నాటి విచారణ ఈ కేసులో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి పార్టీలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేశవ్యాప్తంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు అంబరాన్నంటుతున్న వేళ, హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించి, త్రివర్ణ పతాకానికి వందనం సమర్పించారు. దేశ సమైక్యతను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహా పలువురు కీలక నేతలు పాల్గొని వేడుకలకు మెరుగులద్దారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రామచందర్‌రావు రాజకీయ విమర్శనాస్త్రాలు సంధించారు. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. రాహుల్ గాంధీ నిరంతరం రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని, దేశ అత్యున్నత చట్టం పట్ల ఆయనకు గౌరవం లేదని మండిపడ్డారు. రాహుల్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలిపెట్టుగా పరిణమిస్తున్నాయని, ఆయన ప్రవర్తన రాజ్యాంగ విరుద్ధంగా ఉందని రామచందర్‌రావు ఆరోపించారు. ఇటీవల రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ నేతలు అనడం హాస్యాస్పదమని ఆయన పేర్కొన్నారు. దేశంలో ఓటు చోరీ జరగలేదని, అసలు రాహుల్ గాంధీకే 'బ్రెయిన్ చోరీ' అయిందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఆలోచనా శక్తి లేని మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, వారి అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్ర రాజకీయాలపై స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును కూడా రామచందర్‌రావు ఎండగట్టారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి, మార్ఫింగ్ వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేసిన ఉదంతాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ మార్ఫింగ్



వ్యవహారంలో రేవంత్ రెడ్డిపై ఇప్పటికే క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉందని, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇటువంటి చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వారు తప్పక శిక్ష అనుభవిస్తారని హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాల విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరుపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వీబీ జీ రామ్ జీ' వంటి పథకాలపై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని రామచందర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సంక్షేమం కోసం ఉద్దేశించిన పథకాలను రాజకీయ లబ్ధి కోసం తప్పుగా చిత్రీకరించడం కాంగ్రెస్ నైజమని మండిపడ్డారు. ప్రజలకు అందుతున్న ఫలాలను అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ దౌర్భాగ్యమని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకే నాణేనికి రెండు ముఖాలని రామచందర్‌రావు అభివర్ణించారు. ఈ రెండు పార్టీలు అవినీతిలో కూరుకుపోయాయని, ప్రజా ధనాన్ని లూటీ చేయడంలో ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయని ఆరోపించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. ప్రజలు ఈ రెండు పార్టీల నాటకాలను గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో వారికి తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో భాజపా పోషిస్తున్న పాత్రను వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ దేశాలకు మార్గదర్శిగా మారుతోందని కొనియాడారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడటమే కాకుండా, విధులను కూడా నిర్వర్తించాల్సిన బాధ్యత పౌరులపై ఉందన్నారు. విపక్షాలు కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, దేశాభివృద్ధిలో నిర్మాణాత్మక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు, వేముల అశోక్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, విపక్షాల అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలని కోరారు. రాబోయే ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని, తెలంగాణలో భాజపా జెండా ఎగురవేయడమే తమ అంతిమ లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నేతలు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమం ముగింపులో దేశ భక్తి గీతాలతో పార్టీ కార్యాలయం మారుమోగింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామచందర్‌రావు కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడటానికి భాజపా ఎల్లప్పుడూ ముందుంటుందని, అవినీతి రహిత పాలనే తమ ధ్యేయమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ వేడుకలు పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. మొత్తానికి, భాజపా కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవం కేవలం ఒక వేడుకగానే కాకుండా, రాజకీయ పోరాట పటిమను చాటే వేదికగా మారింది. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి లక్ష్యంగా జరిగిన విమర్శలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూనే, పార్టీ భవిష్యత్ కార్యాచరణను రామచందర్‌రావు దిశానిర్దేశం చేశారు. వేడుకల అనంతరం నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

## జాతీయ పతాకానికి అవమానం

**మునుగోడు, విశాలభారతి:** మునుగోడులో జాతీయ పతాకానికి అవమానం మునుగోడు మండల కేంద్రంలో రహదారులు మరియు భవనముల శాఖ , ఉపకార్యనిర్వాహక ఇంజనీరు వారి కార్యాలయం సబ్ డివిజన్ మునుగోడు కార్యాలయం ఆవరణలో 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా సంబంధిత అధికారులు ఉదయం జాతీయ పతాకావిష్కరణ చేసి గాలికి వదిలేసి అవమాన పరిచారు..జాతీయ పతాకం అధికారుల నిర్లక్ష్యంతో మధ్యలోకి రావడం దారుణమని మండిపడుతున్నారు..నిర్లక్ష్యం వహించి అవమాన పరిచిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## ఘనంగా గణతంత్ర వేడుకలు

**వలిగొండ , విశాలభారతి:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు నర్సాపురంలోని లక్ష్మీ సరస్వతీ విద్యాలయంలో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ముందుగా జాతీయ జెండానుఆవిష్కరించి ఘనంగా జెండా వందనం చేశారు. జెండా వందనం అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు, నాటికలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభకు ప్రేక్షకుల నుంచి విశేషమైన స్పందన లభించింది. కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ పిల్లల ప్రతిభను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో హాజరైన తల్లిదండ్రులు విద్యార్థులకు ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రుల సహకారానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యత భావాలను మరింత బలపరిచాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# బీజేపీ కుట్రలను అర్థం చేసుకోవాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం 'గాంధీభవన్'లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, అటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, ఇటు రాష్ట్రంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక న్యాయం అనే అంశాల చుట్టూ ఆయన ప్రసంగం సాగింది. మహేశ్ కుమార్ గౌడ్ ప్రధానంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 2014 వరకు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం సామాన్యుల కోసం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రస్తుత పాలకులు ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పేదలకు అండగా నిలిచిన పథకాలను తొలగించడం ద్వారా కేంద్రం సామాన్య ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రస్తుత పాలకులు ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతున్నారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. భారతదేశం గర్వించదగ్గ




లౌకికవాద తత్వాన్ని దెబ్బతీసేందుకు పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆక్షేపించారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశంలో విద్వేష పూరిత రాజకీయాలకు తావులేకుండా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్ర రాజకీయాల విషయానికి వస్తే, గత పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక విధ్వంసానికి గురైందని పీసీసీ చీఫ్ ఆరోపించారు. అనవసరమైన ఖర్చులు, అస్తవ్యస్తమైన ప్రాజెక్టుల వల్ల రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, దీనివల్ల తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కోలుకోలేని దెబ్బతిన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని ఈ ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించే ప్రయత్నం చేస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇచ్చిన సూచనలు, సలహాల మేరకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని సంక్షేమం మరియు వికాసం వైపు నడిపించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'కులగణన' సర్వే గురించి ఆయన గర్వంగా మాట్లాడారు. ఈ విప్లవాత్మక నిర్ణయం వల్ల నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు ఆసక్తిగా చూస్తున్నాయని ఆయన అన్నారు. సామాజిక న్యాయం సాధించడంలో కులగణన అనేది ఒక కీలకమైన అడుగు అని, దీని ద్వారా ప్రతి సామాజిక వర్గానికి వారి జనాభా ప్రాతిపదికన ఫలాలు అందుతాయని మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న అంకితభావాన్ని ఆయన చాటిచెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇచ్చిన మాట ప్రకారం దీనిపై ముందుకు వెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. బీసీల రాజకీయ ఎదుగుదలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. దురదృష్టవశాత్తూ, కులగణన ప్రక్రియను, రిజర్వేషన్ల పెంపును బీజేపీ అడ్డుకోవాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. కులగణన బిల్లులు, ఇతర చట్టపరమైన ప్రక్రియలకు ఆ పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని, ఇది ఆ పార్టీకి బీసీలపై ఉన్న వివక్షను చూపిస్తుందని విమర్శించారు. బీజేపీ చేస్తున్న రాజకీయ కుట్రలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, త్వరలోనే వారికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని మహేశ్ కుమార్ గౌడ్ గుర్తు చేశారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు. గణతంత్ర స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకుంటూ, ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు సామాజిక సమానత్వాన్ని సాధిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమాగా ముగించారు.

# కన్నులపండువగా గణతంత్ర దినోత్సవం

- గణతంత్ర దినోత్సవ వేడుకలు ఢిల్లీలో అంబరాన్నంటాయి
- భారత్ సార్వభౌమత్వాన్ని, సైనిక సామర్థ్యాన్ని చాటిచెప్పింది
- ఢిల్లీ వీధులన్నీ దేశభక్తి నినాదాలతో మారుమోగాయి
- ఆధునిక యుద్ధ తంత్రాల ప్రదర్శనతో ఆకర్షణీయంగా నిలిచాయి
- రాష్ట్రపతి పతాకావిష్కరణ అనంతరం గాల్లోకి ఎగిరిన త్రివర్ణ బెలూన్లు
- దేశ రక్షణ వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందో కళ్లకు కట్టినట్లు చూపింది










**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశ రాజధాని ఢిల్లీలో అంబరాన్నంటాయి. చారిత్రక కర్తవ్యపథ్ వేదికగా జరిగిన ఈ ఉత్సవాల్లో భారతావని తన సార్వభౌమత్వాన్ని, సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఉదయం నుంచే ఢిల్లీ వీధులన్నీ త్రివర్ణ శోభితమయ్యాయి. దేశభక్తి నినాదాలతో పరిసరాలు మారుమోగాయి. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడంతో ప్రారంభమైన ఈ వేడుకలు, అడుగడుగునా భారతీయతను ప్రతిబింబిస్తూ కన్నులపండువగా సాగాయి. గతానికి భిన్నంగా ఈసారి సరికొత్త సంప్రదాయాలు, ఆధునిక యుద్ధ తంత్రాల ప్రదర్శనతో వేడుకలు అత్యంత ఆకర్షణీయంగా నిలిచాయి. వేడుకలు ప్రారంభం కావడానికి ముందు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతీయ యుద్ధ స్మారకాన్ని సందర్శించి దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. మాతృభూమి రక్షణలో ప్రాణాలను పణంగా పెట్టిన సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం ఆయన కర్తవ్యపథ్ వద్దకు చేరుకోగా, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంప్రదాయబద్ధమైన గుర్రపు బగ్గీలో ముఖ్య అతిథులతో కలిసి వేదిక వద్దకు విచ్చేశారు. ఈ ఏడాది గణతంత్ర వేడుకలకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లాయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ముఖ్య అతిథులుగా హాజరై భారత గౌరవాన్ని పంచుకున్నారు.

రాష్ట్రపతి పతాకావిష్కరణ అనంతరం గాల్లోకి ఎగిరిన త్రివర్ణ బెలూన్లు, హెలికాప్టర్ల నుంచి కురిసిన పూలవాన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వెంటనే పరేడ్ ప్రారంభమైంది. లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్ ఈ ప్రతిష్ఠాత్మక పరేడ్‌కు నేతృత్వం వహించారు. త్రివిధ దళాల సమన్వయం, క్రమశిక్షణతో కూడిన కవాతు దేశ రక్షణ వ్యవస్థ ఎంత పటిష్టంగా ఉందో కళ్లకు కట్టినట్లు చూపింది. ముఖ్యంగా సైనిక దళాల కవాతులో కనిపించిన గంభీరత, అడుగులో అడుగు వేస్తూ సాగిన వారి నడక దేశాభిమానాన్ని ఉరకలెత్తించింది. ఈ దృశ్యాలు తిలకించేందుకు తరలివచ్చిన వేలాది మంది జనం హర్షధ్వానాలతో కర్తవ్యపథ్‌ను హోరెత్తించారు. ఈ ఏడాది పరేడ్‌లో సరికొత్త అంశాలు చోటుచేసుకున్నాయి. పోరాట సమయంలో ధరించే యుద్ధ యూనిఫామ్‌తో అశ్వికదళం తొలిసారిగా ఈ కవాతులో పాల్గొనడం విశేషం. ఇది సైన్యంలోని పాత, కొత్త సంప్రదాయాల కలయికకు ప్రతీకగా నిలిచింది. స్వదేశీ సాంకేతికతతో తయారైన 'ప్రచండ్' హెలికాప్టర్లు గగనతలంలో చేసిన విన్యాసాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయి. యుద్ధ భూమిలో శత్రువుల గుండెల్లో నిదురపోయేలా ఈ హెలికాప్టర్లు చేసిన ఆక్రోబాటిక్ ప్రదర్శనలు భారత వైమానిక దళ శక్తిని చాటిచెప్పాయి. ఆయుధ వ్యవస్థల ప్రదర్శనలో స్వదేశీ తయారీకి పెద్దపీట వేయడం ఈసారి పరేడ్ ప్రత్యేకత.

వందేమాతరం ఇతివృత్తంతో సాగిన ఈ వేడుకల్లో దేశాభివృద్ధి, సాంస్కృతిక వైవిధ్యం ప్రధానాంశాలుగా నిలిచాయి. ఆపరేషన్ సిందూర్ గొప్పదనాన్ని వివరించేలా రూపొందించిన నిశ్చల చిత్రాలు, ఆయుధ ప్రదర్శనలు భారత నౌకాదళ మరియు రక్షణ రంగ విజయాలను గుర్తుచేశాయి. అలాగే అంతర్జాతీయ మైత్రిని చాటుతూ ఐరోపాకు చెందిన నలుగురు సైనిక అధికారులు తమ దేశ జెండాలతో జిప్సీ వాహనాల్లో పరేడ్‌లో పాలుపంచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది భారతదేశం ఇతర ప్రపంచ దేశాలతో కలిగి ఉన్న బలమైన దౌత్య సంబంధాలకు నిదర్శనంగా కనిపించింది. భారత సైన్యం తన వ్యూహరచనలో సాధించిన పురోగతిని ప్రదర్శిస్తూ, తొలిసారిగా 'బ్యాటిల్ ఎరే' ఫార్మాట్‌లో కవాతు నిర్వహించింది. యుద్ధ రంగంలో సైన్యం ఎలా మోహరిస్తుందో, శత్రువులను ఎలా చుట్టుముడుతుందో ఈ ఫార్మాట్ ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపారు. 61 కావల్రీ దళం తన గంభీరమైన నడకతో ముందుకు సాగగా, నిఘా కోసం వినియోగించే అత్యాధునిక 'రీకానిసెన్స్' వాహనాలు వాటి వెంటే అనుసరించాయి. ఆపరేషన్ సిందూర్ జెండాతో ధ్రువ హెలికాప్టర్ ప్రదర్శించిన విన్యాసం దేశ సైనిక పటిమను, సమరోత్సాహాన్ని ప్రతిబింబించింది.

సాంకేతికతతో పాటు సాహసానికీ ఈ వేడుకల్లో పెద్దపీట వేశారు. అంతరిక్ష రంగంలో భారత కీర్తిని దశదిశలా వ్యాపింపజేసిన వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాకు అత్యున్నత శౌర్య పురస్కారం 'అశోక్ చక్ర'ను రాష్ట్రపతి ప్రదానం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన తొలి భారతీయుడిగా ఆయన సాధించిన ఘనతను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. యుద్ధ రంగంలోనే కాదు, విజ్ఞాన శాస్త్రంలోనూ భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతోందని ఈ పురస్కారం ద్వారా మరోసారి నిరూపితమైంది. శుభాన్షు శుక్లా వంటి వీరులు నేటి యువతకు స్ఫూర్తిప్రదాతలుగా నిలుస్తారనడంలో సందేహం లేదు. పరేడ్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శకటాలు భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను చాటిచెప్పాయి. ప్రతి శకటం ఒక కథను, ఆ రాష్ట్ర ప్రత్యేకతను వివరిస్తూ సాగింది. గ్రామీణ కళల నుంచి అత్యాధునిక ఐటీ రంగం వరకు అన్ని రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని ఈ శకటాలు కళ్లకు కట్టాయి. రంగురంగుల వేషధారణలతో కళాకారులు చేసిన నృత్యాలు పరేడ్‌కు మరింత వన్నె తెచ్చాయి. దేశంలోని విభిన్న సంస్కృతుల మధ్య ఉన్న ఐక్యతను చాటిచెప్పేలా సాగిన ఈ ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి.

మొత్తంగా 77వ గణతంత్ర వేడుకలు నవ భారత నిర్మాణ సంకల్పాన్ని ప్రపంచానికి చాటాయి. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి, అంతరిక్షంలో విజయాలు, సాంస్కృతిక వైభవం కలగలిసి ఈ వేడుకను ఒక చారిత్రక ఘట్టంగా మార్చాయి. కర్తవ్యపథ్‌పై సైనికుల అడుగుల సవ్వడి, యుద్ధ విమానాల గర్జన చూస్తుంటే భారతదేశ భవిష్యత్తు సురక్షితమైన చేతుల్లో ఉందని స్పష్టమైంది. ఈ వేడుకలు ప్రతి భారతీయుడిలో దేశభక్తిని, ఆత్మవిశ్వాసాన్ని నింపాయి. జాతీయ గీతాలాపనతో ముగిసిన ఈ ఉత్సవం ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా, గణతంత్ర వేడుకల పట్ల ప్రజల్లో ఉన్న ఉత్సాహం ఏ మాత్రం తగ్గలేదని ఈ వేడుకలు నిరూపించాయి. ఈ స్ఫూర్తితోనే వికసిత భారత్ వైపు అడుగులు వేయాలని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ, ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలనే సందేశం ఈ వేడుకల ద్వారా వ్యక్తమైంది.

# రాష్ట్రంలో అనుముల రాజ్యాంగం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్నది 'ప్రజా పాలన' కాదని, అది రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న 'రాక్షస పాలన' అని ఆయన అభివర్ణించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాజ్యాంగ ఉల్లంఘనలపై ప్రదర్శించిన లఘు నాటికను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యార్థులు తమ ప్రదర్శన ద్వారా రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు ఎలా పతనమవుతున్నాయో కళ్లకు కట్టినట్లు చూపించారని కేటీఆర్ కొనియాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ ద్వంద్వ ప్రమాణాలను కేటీఆర్ ఎండగట్టారు. గత ఎన్నికల సమయంలో తుక్కుగూడలో విడుదల చేసిన 'న్యాయ పత్రం'లో పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకంగా మాట్లాడిన రాహుల్, అదే వేదికపై బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన నాయకులను పక్కన కూర్చోబెట్టుకోవడం ఆయన నైతికతకు నిదర్శనమని విమర్శించారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో, కాంగ్రెస్ న్యాయ పత్రంలో న్యాయం అంతే ఉందని ఆయన ఎద్దేవా చేశారు. దీనిని 'న్యాయ పత్రం' అని కాకుండా 'అన్యాయ పత్రం' అని పిలవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభల్లో జెండా గద్దెలను కూల్చాలని పిలుపునివ్వడం శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమేనని, ఇది రాజ్యాంగ విలువల సమాధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పౌర హక్కుల హననం జరుగుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడలో దళిత యువకుడు కర్రా రాజేష్ పోలీస్ కస్టడీలో చిత్రహింసలకు గురై మరణించి 60 రోజులు గడిచినా, ముఖ్యమంత్రి కానీ, స్థానిక మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కానీ కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిస్టులను ఉగ్రవాదుల మాదిరిగా అరెస్ట్ చేస్తున్నారని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. లగచర్లలో గిరిజన ఆడబిడ్డల ఇళ్లలోకి చొరబడి వారి వ్యక్తిత్వ హననం చేయడం, భూముల కోసం పోరాడుతున్న రైతులను జైళ్లలో పెట్టడం వంటి చర్యలు ఈ ప్రభుత్వ దుర్మార్గ పాలనకు పరాకాష్ట అని ఆయన విమర్శించారు. హైడ్రా, మూసి పునరుజ్జీవం పేరిట పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చడం రేవంత్ రెడ్డి క్రూరత్వానికి నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. రైతు, యువజన, ఎస్సీ, ఎస్టీ, బీసీ డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ అందరినీ మోసం చేసిందని, ఎన్నికల ముందు ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని ఆయన నిలదీశారు. "రాజ్యాంగం ఎంత గొప్పదైనా, దాన్ని అమలు చేసే వారిలో చిత్తశుద్ధి లేకపోతే ప్రయోజనం శూన్యం" అన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాటలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. నేడు కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ఒకరితో ఒకరు పోటీ పడి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

రేవంత్ రెడ్డి పాలనలో 'ప్రజా పాలన' మృగ్యమై కేవలం 'అనుముల రాజ్యాంగం' మాత్రమే నడుస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేడు ప్రతి పౌరుడిపై ఉందని పిలుపునిచ్చారు. ఒకవైపు మతాల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ, మరోవైపు రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న కాంగ్రెస్ దేశానికి పెనుముప్పుగా మారాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీల నుంచి రాష్ట్రాన్ని, దేశాన్ని కాపాడుకోవడానికి ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన ప్రజలకు సూచించారు. హెచ్‌సీయూ విద్యార్థుల పోరాటాన్ని కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నుంచి కాపాడుకోవడానికి విద్యార్థులు చేస్తున్న కృషి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. ముఖ్యమంత్రి ఈ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం చెరబట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు గ్రీన్ బెంచ్ నియమించిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసిందని, ఈ కుంభకోణం విలువ దాదాపు రూ. 10,000 కోట్లు ఉంటుందని కేటీఆర్ వెల్లడించారు.

తనకు సంబంధం లేని భూములను, చెరువులను తాకట్టు పెట్టి ముఖ్యమంత్రి 'ఫైనాన్షియల్ ఫ్రాడ్'కు పాల్పడ్డారని సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ నివేదిక స్పష్టం చేసినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నా, ఢిల్లీలో రాజ్యాంగం గురించి మాట్లాడే రాహుల్ గాంధీ ఇక్కడ ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూ దోపిడీపై కాంగ్రెస్ అధిష్ఠానం మౌనం వహించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ఆయన నిలదీశారు. తెలంగాణ భవిష్యత్తును కాపాడటంలో విద్యార్థులు, యువత ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. మొత్తానికి, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రజాస్వామ్యానికి చేటు తెస్తున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత అజెండా కోసం వ్యవస్థలను వాడుకుంటున్నారని, ప్రజల గొంతును నొక్కివేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే తన తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని, బాధితుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

రాజ్యాంగ విలువలను కాపాడటంలో విఫలమైన ఈ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని కేటీఆర్ విశ్లేషించారు. ముఖ్యంగా విద్యావంతులు, విద్యార్థులు ఈ ప్రభుత్వ మోసాలను గమనిస్తున్నారని, హెచ్‌సీయూ విద్యార్థుల నిరసనే దీనికి నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి పేరుతో వినాశనాన్ని సృష్టించడం కాంగ్రెస్ నైజమని, గతంలో కూడా ఇలాంటి దౌర్జన్యాలే చేసి ప్రజల ఆగ్రహానికి గురయ్యారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న కాంగ్రెస్ నేతలకు తెలంగాణ గడ్డపై స్థానం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, మహిళలు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగం అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారిందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే రాజ్యాంగబద్ధమైన పోరాటం తప్పదని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణను దోచుకుంటున్న శక్తులపై యుద్ధం ప్రకటిస్తామని, సామాన్యుడి గొంతుకగా బీఆర్ఎస్ నిలుస్తుందని కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# జర్నలిస్టులకు మరో బిగ్ షాక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




తెలంగాణ రాష్ట్రంలో వాహనాలపై 'ప్రెస్' అనే పదాన్ని ఉపయోగించడంపై రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ తీసుకున్న తాజా నిర్ణయం మీడియా రంగంలో పెను సంచలనంగా మారింది. ప్రభుత్వం నుంచి అధికారికంగా గుర్తింపు పొందిన అక్రిడిటేషన్ కార్డు కలిగిన జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలపై 'ప్రెస్' అని రాసుకోవడానికి అర్హులని స్పష్టం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వాహనాలపై ప్రెస్ లోగోల వినియోగానికి సంబంధించి ఒక స్పష్టమైన, కఠినమైన నియమావళి అమల్లోకి వచ్చినట్లయింది. గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ప్రెస్ స్టిక్కర్ల దుర్వినియోగం విపరీతంగా పెరిగిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సెంట్రల్ మోటార్ వెహికల్ యాక్ట్ 1989 నిబంధనల ప్రకారం, అనధికారికంగా వాహనాలపై లేదా నంబర్ ప్లేట్లపై 'ప్రెస్', 'పోలీస్', 'గవర్నమెంట్' వంటి పదాలను ఉపయోగించడం చట్టరీత్యా నేరం. అయినప్పటికీ, చాలామంది నిబంధనలను బేఖాతరు చేస్తూ తమ వ్యక్తిగత వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లను తగిలించుకుంటున్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, ఇకపై అక్రిడిటేషన్ లేని వారు ఈ గుర్తులను వాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ప్రస్తుతం సమాజంలో మీడియా పరిధి విస్తరించింది. ప్రధాన స్రవంతి పత్రికలు, ఛానెళ్లతో పాటు యూట్యూబ్ ఛానెల్స్, సోషల్ మీడియా పేజీలు, చిన్న తరహా డిజిటల్ పత్రికలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. వీటిలో పనిచేసే అనేకమంది వ్యక్తులు తమ సంస్థలు ఇచ్చే సాధారణ ఐడీ కార్డులను చూపిస్తూ వాహనాలపై 'ప్రెస్' బోర్డులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ముసుగులో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, టోల్ ప్లాజాల వద్ద గొడవలు చేయడం వంటి ఘటనలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయి. ఈ పరిస్థితిని అదుపు చేసేందుకు సమాచార శాఖ కమిషనర్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల పౌర సంబంధాల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తమ పరిధిలోని పోలీస్ మరియు రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, అనధికారిక ప్రెస్ స్టిక్కర్ల వాడకాన్ని అరికట్టాలని మెమోలో పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డు లేని వారు తమ వాహనాలపై ఉన్న లోగోలను, బోర్డులను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో జరిమానాలతో పాటు వాహనాల సీజ్ వంటి చర్యలు ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల నిజాయితీగా పనిచేస్తున్న క్షేత్రస్థాయి జర్నలిస్టులకు కొంత ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. ఎందుకంటే, ప్రధాన మీడియా సంస్థల్లో పనిచేస్తున్నప్పటికీ అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఉండవు. ప్రభుత్వం విధించే కఠినమైన నిబంధనల వల్ల కేవలం పరిమిత సంఖ్యలో ఉన్న సీనియర్ జర్నలిస్టులకు మాత్రమే ఈ గుర్తింపు కార్డులు అందుతున్నాయి. దీనివల్ల వేలాది మంది జూనియర్ రిపోర్టర్లు, ఫోటోగ్రాఫర్లు ఇప్పుడు తమ వాహనాలపై ప్రెస్ గుర్తును వాడుకునే హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు, నకిలీ జర్నలిస్టుల బెడదను తప్పించడానికి ఇది సరైన మార్గమని ప్రభుత్వం భావిస్తోంది. జర్నలిజం పేరుతో జరుగుతున్న అక్రమాలను అరికట్టడానికి, నిజమైన జర్నలిస్టులకు సమాజంలో గౌరవం పెంచడానికి ఈ నిబంధనలు దోహదపడతాయని అధికారులు సమర్థిస్తున్నారు. పోలీసులకు కూడా తనిఖీల సమయంలో ఎవరు అసలైన జర్నలిస్టు, ఎవరు నకిలీ అనే విషయంలో స్పష్టత వస్తుందని, దీనివల్ల విధి నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని వారు పేర్కొంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా త్వరలోనే ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నాయి. నగరాలు, పట్టణాల కూడళ్లలో వాహనాలను తనిఖీ చేసి, అక్రిడిటేషన్ కార్డు చూపించని పక్షంలో తక్షణమే స్టిక్కర్లను తొలగించి జరిమానా విధిస్తారు. అవసరమైతే సదరు వ్యక్తులపై ఫోర్జరీ కేసులు కూడా నమోదు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. చట్టపరమైన గుర్తింపు లేకుండా ప్రభుత్వ చిహ్నాలను లేదా వృత్తిపరమైన గుర్తులను వాడటం శిక్షార్హమని అధికారులు పదేపదే గుర్తు చేస్తున్నారు. జర్నలిస్టు సంఘాల నుంచి ఈ నిర్ణయంపై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. నకిలీలను అరికట్టాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నప్పటికీ, అక్రిడిటేషన్ ప్రక్రియలో ఉన్న లోపాలను వారు ఎత్తిచూపుతున్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ప్రభుత్వ గుర్తింపు కార్డు అందేలా చూడాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కార్డుల జారీ ప్రక్రియను సరళతరం చేస్తేనే ప్రభుత్వ నిర్ణయం సత్ఫలితాలను ఇస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు. కేవలం అక్రిడిటేషన్ కార్డు ఉన్నవారికే అనుమతి ఇవ్వడం వల్ల క్షేత్రస్థాయిలో వార్తల సేకరణకు వెళ్లే యువ జర్నలిస్టులకు రక్షణ కరువయ్యే అవకాశం ఉందనే ఆందోళన కూడా ఉంది. అర్ధరాత్రి వేళల్లో లేదా అత్యవసర పరిస్థితుల్లో రిపోర్టింగ్ చేసేటప్పుడు ప్రెస్ స్టిక్కర్ వారికి ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని, ఇప్పుడు ఆ అవకాశం లేకపోవడం వల్ల విధి నిర్వహణ కష్టతరమవుతుందని కొందరు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మధ్యేమార్గంగా ఏదైనా గుర్తింపును పరిశీలిస్తుందేమో చూడాలి. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ కఠిన నిర్ణయం మీడియా రంగంలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లయింది. ప్రెస్ అనే పదాన్ని అడ్డుపెట్టుకుని సాగుతున్న అక్రమాలకు ఇది అడ్డుకట్ట వేయనుంది. అయితే, ఈ నిబంధనలను అమలు చేసే క్రమంలో నిజమైన జర్నలిస్టులు వేధింపులకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పారదర్శకమైన అక్రిడిటేషన్ విధానం, కఠినమైన నిబంధనలు జత కలిసినప్పుడే మీడియా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడుతుంది.

# కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైంది



మొదటిపేజీ తరువాయి

ఆయా పార్టీల నేతలు క్షేత్రస్థాయి పర్యటనలు పెంచారు. ఈ తరుణంలో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం చేసిన తాజా వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. సోమవారం జనవరి 26న మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని పేర్కొనడం చర్చనీయాంశమైంది. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న క్రమంలో ప్రజల నుంచి వస్తున్న స్పందనను తాము నిశితంగా గమనిస్తున్నామని కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరింత వేగంగా, పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా పాలన పరమైన నిర్ణయాల్లో జాప్యం జరుగుతోందని, అది ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తోందని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని హామీల అమలులో వేగం పెంచినప్పటికీ, సామాన్యుల సమస్యల విషయంలో ఇంకా కసరత్తు జరగాల్సి ఉందన్నారు. ఈ వ్యతిరేకత ప్రభావం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశం ఉందని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తు విషయమై రాజకీయ వర్గాల్లో సాగుతున్న ప్రచారానికి కోదండరాం సమాధానమిస్తూ, తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన టీజేఎస్, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అదే పంథాను అనుసరిస్తుందా లేదా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. తమ పార్టీ అభిప్రాయాలను, క్షేత్రస్థాయిలో తమ కార్యకర్తల మనోగతాన్ని ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానానికి వివరించామని ఆయన వెల్లడించారు. పొత్తుల విషయంలో త్వరలోనే స్పష్టత వస్తుందని చెప్తూనే, కార్యకర్తలు మాత్రం ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు తమ అభ్యంతరాలను తెలియజేసి దిద్దుబాటు చర్యలు కోరారా లేక పొత్తుకు స్వస్తి పలికే ఆలోచనలో ఉన్నారా అనే అంశంపై ఆయన పూర్తిస్థాయిలో క్లారిటీ ఇవ్వలేదు. అయితే ప్రభుత్వం తీరును తప్పుబట్టడం ద్వారా ఆయన కాంగ్రెస్ అధిష్ఠానానికి ఒక బలమైన సంకేతాన్ని పంపారని విశ్లేషకులు భావిస్తున్నారు. పొత్తు ఉన్నా లేకున్నా టీజేఎస్ తన అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు క్షేత్రస్థాయిలో బలోపేతం కావాలని కోదండరాం ఆశిస్తున్నారు. ప్రజాస్వామ్య తెలంగాణలో సామాన్యుడి వాణి వినిపించడమే తమ పార్టీ లక్ష్యమని, ఆ దిశగా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

రాష్ట్రానికి జీవనాడి వంటి సింగరేణి సంస్థ విషయంలో కోదండరాం గట్టిగా స్పందించారు. సింగరేణిని కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ పౌరుడిపై ఉందన్నారు. గత కొంతకాలంగా సింగరేణి ప్రైవేటీకరణ లేదా వేలంపాటల చుట్టూ జరుగుతున్న వివాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక సంస్థ కాదని, తెలంగాణ రాష్ట్ర సంపద అని, దీనిని కాపాడుకోవడంలో ప్రభుత్వం రాజీ పడకూడదని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా నిర్ణయాలు ఉండాలని, ప్రైవేటు శక్తులకు మేలు చేసేలా పాలన సాగకూడదని ఆయన హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై కూడా కోదండరాం తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రం అంతా అవినీతిమయమైందని, కేసీఆర్ కుటుంబం తప్ప తెలంగాణలో మరెవరూ ఆర్థికంగా బాగుపడలేదని ధ్వజమెత్తారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమర వీరుల ఆశయాలకు విరుద్ధంగా పాలన సాగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార దుర్వినియోగానికి ఫోన్ ట్యాపింగ్ ఒక పరాకాష్ట అని, తాను కూడా ఆ ఫోన్ ట్యాపింగ్ బాధితుడినేనని ఆయన సంచలన విషయాన్ని వెల్లడించారు. పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల బరిలో ఈసారి బహుముఖ పోటీ కనిపించేలా ఉంది. అధికార కాంగ్రెస్ తన పట్టు నిలుపుకోవాలని భావిస్తుండగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తన ఉనికిని చాటుకోవాలని చూస్తోంది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో ఉత్సాహంగా ఉన్న బీజేపీ, పట్టణ ప్రాంతాల్లో తన బలాన్ని నిరూపించుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. మరోవైపు పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన కూడా ఈసారి బరిలో ఉంటామని ప్రకటించడంతో పోటీ రసవత్తరంగా మారింది. కల్వకుంట్ల కవిత సారథ్యంలోని తెలంగాణ జాగృతి కూడా అభ్యర్థులను నిలబెట్టే యోచనలో ఉండటంతో ఓట్ల చీలిక ఎవరికి నష్టం కలిగిస్తుందనే ఆందోళన పార్టీల్లో మొదలైంది. ఈ క్రమంలో కోదండరాం నేతృత్వంలోని టీజేఎస్ అడుగులు ఎటువైపు పడతాయన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ కోదండరాం కాంగ్రెస్ పొత్తు నుంచి తప్పుకుని సొంతంగా పోటీ చేస్తే, మేధావులు, విద్యావంతులు, తెలంగాణ ఉద్యమకారుల ఓట్లు టీజేఎస్ వైపు మళ్లే అవకాశం ఉంది.

## హెల్త్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయం




**నిజామాబాద్ జిల్లా, విశాలభారతి:** నగరంలోని 34 వ డివిజన్ పరిధిలోని మిర్చి కంపౌండ్ లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా బిజెపి యువ నాయకుడు బంటు ప్రవీణ్ కుమార్(పండు) ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజున తమ బిజెపి నాయకుడు పేద ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి హెల్త్ క్యాంప్ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఇలాంటి యువకులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. పేద, మధ్య తరగతి వారికి ప్రధానంగా కావాల్సింది విద్య, వైద్యమేనని తర్వాత (ఆవాస్) ఒక గృహాన్ని నిర్మించుకోవడం చిరకాల స్వప్నమని, వీటిని నిర్వర్తించి పేదలకు సమకూర్చాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఈ హెల్త్ క్యాంప్ లో ఎంఆర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు జనరల్ మెడిసిన్ డాక్టర్ దొరబాబు , జనరల్ సర్జన్ డాక్టర్ వెంకటరమణ , న్యూరో సర్జన్ డాక్టర్ సర్వరాజ్ పాల్గొన్నట్లు బిజెపి యువ నాయకుడు బంటు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో షుగర్ టెస్ట్ లు, బిపి టెస్టులతో పాటు అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

## వాటర్ ప్యూరిఫైయర్ బహుకరించిన పూర్వ విద్యార్థులు



**దేవరుప్పుల, విశాలభారతి :** 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని దేవరుప్పుల మండలం, నీర్మాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో 199798బ్యాచ్ పూర్వ విద్యార్థులు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిల్ ,టిఫిన్ బాక్స్ ఉన్నత పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.గోవర్ధనరెడ్డి 199798 పూర్వ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రవణ్, కాడిబోయిన రవి,సింగరపు మురళీ,సంతోష్ రెడ్డి,మెడ పూర్ణచంద్,యెన్నం సోమరాజు, తూటి సంజీవ, సొప్పరి పరిశరాం, వడ్లకొండ మహేందర్ నక్క యాకుబ్, విమల,దేవేంద్ర పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవలు

**పాలడుగు నవీన్ జ్ఞాపకాలు బహుమతులు పంపిణి**



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజు పల్లి గ్రామంలోని హరిజన కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు గ్రామ ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాస్కుల అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ ఆటల పోటీలు నిర్వహించగా వాటిలో విజేతలైన విద్యార్థులకు ఈ పాఠశాల పూర్వ విద్యార్థి పాలడుగు ప్రవీణ్ సోదరుడు దివంగత పాలడుగు నవీన్ జ్ఞాపకార్థం సుమారు రూ.4000 విలువైన బహుమతులు అందింజేశారు. అదేవిధంగా మూడవ తరగతి విద్యార్థులకు ఫండమెంటల్ లిటరసీ కి సంబంధించిన స్టడీ మెటీరియల్ కూడా పంపిణీ చేసినట్లు ప్రధాన ఉపాధ్యాయులు వెల్లడించారు. ఎల్లవేళలా పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న పాలడుగు సోదరులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు కొండ ఊర్మిళ మల్లారెడ్డి, ఉప సర్పంచ్ జోగు అనిల్, వార్డు సభ్యులు, అంగన్ వాడి ఉపాధ్యాయులు కొమ్ము మంగ, చింతల శ్రీలత, మేకపోతుల రేణుక, శ్రీవాణి అధ్యక్షురాలు అటికం మణమ్మ ,గ్రామ ప్రముఖులు తల్లిదండ్రులు విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు రుణపడి ఉన్నాం

**నోముల సత్తిరెడ్డి శ్రీ కంఠమహేశ్వర కాలనీ అధ్యక్షులు**



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని శ్రీ కంఠమహేశ్వర కాలనీలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకను ఆ కాలనీ ప్రధాన కార్యదర్శి రాచకొండ మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ కంఠమహేశ్వర కాలనీ అధ్యక్షులు నోముల సత్తిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగినది. తదినంతరం వారు మాట్లాడుతూ దేశ ప్రజలు అందరూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు రుణపడి ఉన్నామని తెలిపారు.బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే ఇప్పటివరకు నడుస్తున్న ప్రభుత్వాలు ఏర్పడ్డాయని, దేశ ప్రజలలో పేద ధనిక అని తేడా లేకుండా అందరికీ ఒకే చట్టం వర్ధింప చేసి ప్రజలను స్వేచ్ఛ వాయువులు పీల్చేలా చేశాడని తెలిపారు.దేశ ప్రజలు అందరూ సమానమేనని అందరికీ సమానంగా న్యాయం జరగాలనే ముఖ్య ఉద్దేశంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రాశారని ఈ సందర్భంగా అయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ కాలనీ గౌరవ అధ్యక్షులు దర్శనం యాదయ్య,ఉపాధ్యక్షులు వెంకటేష్ గౌడ్,సహాయ అధ్యక్షులు కడమంచి రాయకల్,ఐలపురం కిష్టయ్య,గుత్తా జలంధర్,సందగళ్ల సతీష్ గౌడ్,మార్గం శివకృష్ణ యాదవ్,గంపల వెంకటరెడ్డి, బాలయ్య శర్మ,అంతటి రాజు గౌడ్,తుమ్మల నాగరాజు రెడ్డి,వట్టి లింగారెడ్డి,బోగా శ్రీనివాస్,వెంకటేష్,నాగేశ్వరరావు,జింకల మారయ్య యాదవ్,వినయ్,శివప్రసాద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ భవన్ నందు 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**నిజామాబాద్, విశాలభారతి:** 77వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించడం జరిగింది. అదేవిధంగా గాంధీ చౌక్, రైల్వే స్టేషన్ వద్ద కూడా జెండా ఆవిష్కరించడం జరిగింది. నెహ్రూ పార్క్ చౌరస్తా వద్ద నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగం, పోరాటం వల్ల దేశానికి 1947 వ సంవత్సరంలో స్వాతంత్రం రావడం జరిగిందని, అందులో ముఖ్యంగా మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర అనంతరం దేశాన్ని ఏ విధంగా పరిపాలన కొనసాగించాలి, ఏ విధంగా అభివృద్ధి చేయాలి, ఏ విధంగా రాజ్యాంగాన్ని నిర్మించి దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించాలని జవహర్లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా సుదీర్ఘ ఆలోచన జరిపి డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన రాజ్యాంగ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కి చోటు కల్పించి, వారు వివిధ దేశాల రాజ్యాంగాలన్నింటినీ పరిశీలించిన తర్వాత దేశానికి అమూల్యమైన రాజ్యాంగాన్ని అందించడం జరిగిందని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్ బిన్ హందాన్, నూడ చైర్మన్ కేశ వేణు,పిసిసి ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్,పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్,రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు జావీద్ అక్రమ్,మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.




# భారత రాజ్యాంగం గొప్పది

- ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి
- జాతీయ జెండాను ఆవిష్కరించిన రూరల్ ఎమ్మెల్యే
- భారత రాజ్యాంగం చాలా గొప్పదని



**నిజామాబాద్, విశాలభారతి:**

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. నగరంలోని కంటేశ్వర్ బైపాస్ లో గల నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం 77 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ... ఎంతోమంది మహానుభావుల త్యాగాల వల్ల స్వాతంత్రం వచ్చిందని, స్వాతంత్రం వచ్చిన తర్వాత మన దేశాన్ని ఇలా పరిపాలించుకోవాలో అన్న నేపథ్యంలో మన భారతదేశానికి రాజ్యాంగం కావాలని , భారతదేశానికి రాజ్యాంగం రచించుకోవడం జరిగిందని. దీనికి చైర్మన్ గా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వ్యవహారించి, మన దేశానికి సమాన హక్కులు సమాన అవకాశాలు, సమాన అభివృద్ధిని చేసుకోవడానికి పెద్ద రాజ్యాంగాన్ని రచించడం జరిగిందని అన్నారు. ఈరోజు రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు అని అన్నారు. స్వాతంత్ర సమరయోధులు మహాత్మా గాంధీ, నెహ్రూ, వంటి నాయకులు ఎన్నోసార్లు జైల్లోకి వెళ్లారని, దేశాన్ని కాపాడుకున్నారని అన్నారు. ప్రస్తుతం మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్రం తెచ్చి, భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. దేశంలో ఎక్కలేని సంక్షేమ పథకాలు మా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్నామని అన్నారు.నిజామాబాద్ రూరల్ ప్రజలకు జిల్లా ప్రజలకు, దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలికెట్ శేఖర్ గౌడ్, జిల్లా ఫిషర్మెష్ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సాయరెడ్డి, బాగారెడ్డి, అమృతపూర్ గంగాధర్, పోలసాని శ్రీనివాస్, రాంచందర్ గౌడ్, ఉమ్మాజీ నరేష్,. చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,.

## కనుల పండుగగా శ్రీ ఉమామహేశ్వర స్వామి కళ్యాణం

**చౌటుప్పల్, విశాలభారతి:**



మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 40వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీ భావనాఋషి భద్రావతి దేవి కళ్యాణోత్సవ కార్యక్రమాలలో భాగంగా సోమవారం రోజున వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణతో గోశిక సత్యనారాయణ అంజమ్మ,బడుగు బాలకృష్ణ అరుణ మరియు బడుగు వెంకటేశ్వర్లు పూజిత ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించడంతో పాటు వేలాదిమంది మహిళా భక్తులచే శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం నుండి శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం వరకు జలకడువల ద్వారా జలమును సమీకరించి శ్రీ శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానంలో కొలువుదీరిన శివలింగమునకు భాజా భజంత్రీలతో శతఘటాభిషేకం తదనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివభక్త మార్కండేయ స్వామి దేవస్థానం అధ్యక్షులు బడుగు జయప్రకాష్,ప్రధాన కార్యదర్శి గోశిక బాల నరసింహా,ఉపాధ్యక్షులు నోముల రఘునాథ్,గోశిక బాలాజీ,సహాయ కార్యదర్శి గోలి శ్రీనివాస్,గోశిక చంద్రకళ నరసింహ,కోశాధికారి బడుగు సుజాత నర్సింహ,సాంస్కృతిక కార్యదర్శి, బడుగు క్రాంతి కుమార్,ప్రచార కార్యదర్శి,కర్నాటి జనార్ధన్,సమన్వయ కార్యదర్శులు,గుర్రం సంతోష్ కుమార్,బాల్యం అనిల్ కుమార్,మరియు ధర్మకర్తల మండలి సభ్యులు కందగట్ల బిక్షపతి,బడుగు లక్ష్మయ్య,చిక్క నరసింహ,గోశిక అంజయ్య,బడుగు శ్రీరాములు,గోశిక విఠలేశ్వర్,గుర్రం వెంకటేశం, గోశిక స్వామి,వనం ధనుంజయ,గుర్రం పాండురంగ,గోశిక నరసింహ,మహా అన్నప్రసాదం సమర్పకులు పిల్లలమర్రి మధుసూదన్ అనిత,మరియు దేవాలయ ప్రధాన అర్చకులు గంజి నరసింహులు బృహు శర్మ,అర్చకులు అనంత రామ కిరీటి,భరత్ పాల్గొన్నారు.

## కోదాడ శానిటరీ ఇన్స్పెక్టర్‌కు ఉత్తమ సేవ పురస్కారం

**కోదాడ, విశాలభారతి:**



కోదాడ మున్సిపాలిటీలో శానిటరీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్స్పెక్టర్ సురేష్ తన సేవలకుగాను ఉత్తమ సేవ పురస్కారం అందుకున్నారు. సోమవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పారిశుధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడంలో సురేష్ చూపిన నిబద్ధతను గుర్తించి ఈ పురస్కారం అందజేశారు. ముఖ్యంగా స్వచ్ఛత కార్యక్రమాలు, డ్రెయినేజీ నిర్వహణ, పారిశుధ్య కార్మికుల సమన్వయంతో పని చేయడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని అధికారులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజారోగ్యం కోసం శానిటరీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, అంకితభావంతో పనిచేసే ఉద్యోగులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలని సురేష్‌కు సూచించారు. అవార్డు అందుకున్న సురేష్ మాట్లాడుతూ తనకు ఈ గౌరవం లభించడం ఎంతో ఆనందంగా ఉందని, మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, సహచరుల సహకారంతోనే ఈ గుర్తింపు సాధ్యమైందని అన్నారు. ముందుకూ ఇదే విధంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని అమలుపర్చడమే జేబీపీ లక్ష్యం



- జేబీపీ అధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్

**కొత్తగూడెం, విశాలభారతి:**

భారత రాజ్యాంగాన్ని కాపాడి పూర్తి స్థాయిలో అమలుపర్చడమే జేబీపీ లక్ష్యమని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ అన్నారు.77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయం వద్ద,బస్టాండ్ సెంటర్, గాజులరాజంబస్తీ, మధుర బస్తీ తదితర ప్రాంతాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి,జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా సకల జనులకు ప్రాథమిక హక్కులు,ఆదేశిక సూత్రాలతో పాటు అందరూ సమానమే అని 18 సంవత్సరాలు నిండిన వయోజనులకు ఓటు హక్కు రాజ్యాంగం ద్వారా వచ్చిందని,భిన్న భాషలు ,భిన్న ప్రాంతాలు,భిన్న సంస్కృతులు,భిన్న మతాలు ఉన్న భారతదేశాన్ని ఒక త్రాటి మీదికి తీసుకువచ్చిన ఘనత భారత రాజ్యాంగానిదని ప్రతీ ఇంట్లో రాజ్యాంగం ఉండాలని,ప్రతీ ఒక్కరూ రాజ్యాంగాన్ని చదవాలన్నారు.జేబీపీ జిల్లా కార్యాలయం నుండి పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ విగ్రహం వరకు వరకు అంబేద్కర్ చిత్రపటంతో,రాజ్యాంగ పీఠికతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,నాగుల రవికుమార్,వినయ్,అల్లకొండ శరత్,రాజు,కిట్టు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కార్పొరేటర్

**ఎల్‌బీ నగర్, విశాలభారతి:**



77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ వివిధ కాలనీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమం లో గోపిరెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా 77 వ రిపబ్లిక్ డే



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలంలోని ఘనంగా 77వ రిపబ్లిక్ డే ను నిర్వహించారు మాక్లూర్ తాసిల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దారు శేఖర్ మాక్లూర్. మండల ప్రజా పరిషత్ కార్యాలయం . ఎండిఓ బ్రహ్మానందం, మాక్లూర్ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై రాజశేఖర్ విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎంఈఓ సత్యనారాయణ. మాక్లూర్ సొసైటీ కార్యాలయం వద్ద సొసైటీ కార్యదర్శి విజయ్. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ పద్మ ఎంపీ ఓ బాలమణి ఏపీవో ఓంకార్. ఆర్ ఐ షఫీ. మండల సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుక

- రాజ్యాంగం ద్వారానే పౌరులకు స్వేచ్ఛ,హక్కులు వచ్చాయి
- మారేపల్లి మల్లారెడ్డి మల్లికార్జున విద్యాసంస్థల చైర్మన్




**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని మల్లికార్జున పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మల్లికార్జున విద్యాసంస్థల చైర్మన్ మారేపల్లి మల్లారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగినది. తదనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్గా నియమితులై,వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి మన దేశ రాజ్యాంగాన్ని రాశారని తెలిపారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే స్వేచ్ఛ లభించి హక్కులు వచ్చాయని వివరించారు.దేశ ప్రజల కోసం ప్రభుత్వాలు ఏర్పడ్డాయని పేద,ధనిక,కుల,మత తేడాలు లేకుండా చట్టం దృష్టిలో అందరూ సమానమేనని తెలిపారు.మన దేశ పౌరులందరూ జాతీయ సమైక్యతను మరియు సమగ్రతను కాపాడాలని మనదేశ సార్వభౌమత్వాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు ఈ సందర్భంగా వారు తెలిపారు.

## ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**నిజామాబాద్, విశాలభారతి:** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవో జిల్లా కార్యాలయ ఆవరణలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు అనంతరం సుమన్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు మరియు జిల్లా ప్రజలందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ విధినిర్వాహణలో అంకితభావంతో విధులు నిర్వహించడం మూలాన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు చేరుటలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రముఖ పాత్ర అమోఘమని అభినందిస్తూ ఇదే వరవడిని కొనసాగిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక అయినటువంటి ఉద్యోగుల పెండింగ్లో గల సమస్యలను తీర్చే బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని, ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్**




**నిజామాబాద్, విశాలభారతి :** భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఉత్సాహంతో గణతంత్ర దినోత్సవ వేడుకలు




**విశాలభారతి, ఎన్ టిపిసి:** 2026 జనవరి 26న ఎన్ టి పి సి రామగుండం మరియు తెలంగాణ 77వ గణతంత్ర దినోత్సవాన్ని గొప్ప ఉత్సాహంతో వేడుకలు జరిగాయి. చందన్ కుమార్ సమంత, హెచ్ ఒ పి ఆర్ & టి జాతీయ జెండాను ఎగురవేసి, సి ఐ ఎస్ ఎఫ్ సిబ్బంది మరియు పాఠశాల విద్యార్థులచే ఆకట్టుకునే కవాతుతో వేడుకలు ప్రారంభమయ్యాయి, దీనిని ముఖ్య అతిథి సమీక్షించారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సమావేశమైన వారిని ఉద్దేశించి ప్రసంగించిన సి కే సమంత, హెచ్ ఒ పి ఆర్ & టి ఎన్ టి పి సి రామగుండం ఉద్యోగుల అంకితభావం మరియు నిబద్ధత పట్ల గర్వం వ్యక్తం చేశారు. మరియు దేశ ఇంధన రంగానికి వారి గణనీయమైన కృషిని గుర్తించారు. మీ కృషి మరియు అంకితభావంతో, ఎన్ టి పి సి రామగుండం దేశానికి స్థిరమైన మరియు నమ్మదగిన శక్తిని అందిస్తూనే ఉంది అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డి యం ఎస్ అధ్యక్షురాలు రాఖీ సమంత అన్ని సెక్షన్ల జి యం లు సీనియర్ కమాండెంట్, సి ఐ ఎస్ ఎఫ్, హెచ్ ఒ డి హెచ్ ఒ హెచ్ ఆర్ సి యం ఒ సి ఐ ఎస్ ఎఫ్ అధికారులు; సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా 77వ ఘనతంత్ర దినోత్సవ వేడుకలు



**సికింద్రాబాద్, విశాలభారతి:** 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ అడ్డగుట్ట డివిజన్ ప్రధాన కార్యదర్శి చందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెదేపా సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ విచ్చేసి తుకారాం గేట్ సుభాష్ చంద్రబోస్ విగ్రహం చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి స్వీట్లు పళ్ళు పంచిపెట్టారు ఈకార్యక్రమంలో పందిరి నర్సిమ్మ, గరిగె ప్రవీణ్, పరిటాల విజయ్, వెంకటస్వామి శంకర్ ముదిరాజ్, మురళి, బాలరాజ్, చంద్రమోహన్, భూషణం, సత్యం, సిద్ధులు, విజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు దేశభక్తిని చాటాలి

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** ప్రతి ఒక్క పౌరుడు దేశభక్తిని చాటాలని, వాడవాడలా పతాకావిష్కరణ ఎగరాలని చిన్ననాటి నుండి పిల్లలకు స్వాతంత్ర సమరయోధులు వారి పోరాటాల గురించి పిల్లలకు వివరిస్తూ దేశభక్తి నూరిపోయాలని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని బౌద్ధ నగర్ డివిజన్లో డివిజన్ బిజెపి అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో పార్సిగుట్ట, అశోక్ నగర్, సంజీవపురం, వారసిగూడ,బౌద్ధ నగర్, అంబానగర్,అంబర్ నగర్, ఎల్ నారాయణ నగర్ తదితర బస్తీలలో పతాకాలను మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ ఆవిష్కరించడం జరిగింది. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్, నేతి సత్యనారాయణ, దత్తు, కుమార్, చైతన్య, జయంత్, శ్రీశైలం, సుబ్బారావు, ప్రమోద్, నాగరాజు, సుధాకర్, లింగం,ఆర్ నర్సింగ్, సతీష్ నేత, ఉమాపతి,సాయి ప్రసాద్, భగీరద్, శ్రీశైలం,సురేష్,అమరావతి,బబ్లు ,కృష్ణారావు మాదిగ,నాని, శ్రీకాంత్,అశోక్,రూప్ సాయ, సోను, కృష్ణ, గజరాజ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గు ఇంటికి ముందు కళ

**కావ్య కిషన్ రెడ్డి. భరత్ గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బౌద్ధ నగర్ లోని అంబర్ నగర్ బస్తి బాల్వాడీ విద్యాలయం సమీపంలో ప్రమోద్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జి. కావ్యకిషన్ రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షులు భరత్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు విద్యార్థినిలకు బహుమతులు అందజేస్తూ వారు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషమని ఇంటికి ముందు ముగ్గులు ఇంటికి కాంతినిస్తుందని, అంతేకాకుండా పరిసరాలు కూడా శుభ్రంగా ఉంటూ ఆహ్లాదకరంగా కరంగా కనిపిస్తాయని అన్నారు. డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయిప్రసాద్ గౌడ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో.. మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్,నాగరాజు,సాయి నాని, కొమరయ్య,అరవింద్, సత్యనారాయణ,శ్రీధర్,అఖిల్,వినయ్,భరత్,జయంత్,అమరావతి,ప్రభావతి,రూపసాయి,,సోను,నవీన్ బండారి,తిమోతి, చంద్రకళ, మహేశ్వరి,విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవ పురస్కారం అందుకున్న ట్రాఫిక్ ఏఎస్ఐ



**ట్రాఫిక్ కానిస్టేబుల్ సామిడి సుధీర్ రెడ్డి**

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న కాట్రగడ్డ శ్రీనివాస్ మరియు ట్రాఫిక్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న సామిడి సుధీర్ రెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ సేవా అధికారిగా ఎంపికయ్యారు.77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భువనగిరిలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ హనుమంతరావు,ఎస్పీ ఆకాంక్ష యాదవ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు.గణతంత్ర వేడుకను పురస్కరించుకొని ఉత్తమ ఏఎస్ఐ కాట్రగడ్డ శ్రీనివాస్ అవార్డుతో పాటు ప్రశంస పత్రాన్ని అందుకున్నారు.చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా పని చేస్తూ ట్రాఫిక్ సేవల్లో ఉత్తమ ప్రతిభ చూపించారు.గతంలో శ్రీనివాసు ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డులు ప్రశంస పత్రాలు కూడ అందుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా విధి నిర్వహణ నా కర్తవ్యం గా భావించాము.ప్రభుత్వ ఆదేశాల అనుసారంగా ప్రజలకు సేవలు అందిస్తూ విధి నిర్వహణ చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**ఖమ్మం, విశాలభారతి:** 77వ రిపబ్లిక్ డే సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో టీజీవో భవన్ నందు అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు మోదుగు వేలాద్రి అధ్యక్షతన జండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ ఎందరో స్వతంత్ర సమరయోధుల త్యాగ ఫలితంగా భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని తరువాత భారతదేశానికి ఒక రాజ్యాంగాన్ని రచించి దానిని అమలులోకి తీసుకువచ్చి నేడు సర్వసత్వక గణతంత్ర రాజ్యాంగ ప్రపంచ దేశాలలో అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారతదేశ అవతరించిందని కొనిఆడారు. స్వాతంత్ర్య సమరయోధులను భారత రాజ్యాంగ నిర్మాణ కర్తలకు అభినందనలు తెలియజేశారు. వందేమాతరం నినాదం స్వతంత్ర ఉద్యమానికి పునాది అని వందేమాతర గేయం రచించి నేటికీ 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మహిళ కార్యదర్శి పి సుధారాణి, టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్ తెలంగాణ అగ్రి డాక్టర్స్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు బాలాజీ టీజీవో రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి ప్రిన్సిపల్ విజయ కుమారి, అరుణ జ్యోతి, శాంతి కుమారి, బి.కృష్ణార్జునరావు, జల్లి పుష్ప రాజు, మోదుగు వెంకటేశ్వర్లు, బి మోహన్, తిరుపతిరావు, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 77 దినోత్సవ వేడుకలు

**పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల వితరణ**

**పాల్వంచ రూరల్, విశాలభారతి:** పాల్వంచ మండల పరిధిలోని దంతెల బోర ప్రాథమికోన్నత పాఠశాలలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు అనంతరం,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లెంపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది సమావేశంలో, దంతెల బోర పాఠశాలకు,ఎర్ర బోరు గ్రామం నుండి వచ్చే విద్యార్థులు దుస్తులు లేక ఇబ్బంది పడుతున్న సందర్భంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ మిత్ర బృందం నవభారత్ గాంధీనగర్ కు చెందిన 9 మంది మిత్రులు కలిసి ఈరోజు 25 మంది పిల్లలకు ఏకరూప దుస్తులు అందజేయడం జరిగింది. ఈ దుస్తులను ఈరోజు జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో దంతెల బోర గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ్రు ప్రసాద్, ఉపసర్పంచ్ తటుకుల మల్లికార్జున్ రావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొండ్రు ప్రసాద్ మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలంటే విద్యా వైద్య సౌకర్యాలు బాగుండాలని ఈ క్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం వెంకటేశ్వర్లు కృషి చేస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. చెరుకూరి శేఖర్ బాబు మాట్లాడుతూ ఈ విధంగా దుస్తులు అందించడం చాలా ఆనందంగా ఉందని ఇకమీదట కూడా ఇలాంటి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వార్డు మెంబర్ సురేష్,నాగిరెడ్డి, నాగభూషణం, రాంబాబు, సత్యనారాయణ, శ్రీలత రెడ్డి, పూర్వ విద్యార్థి జానకి రాములు, అదేవిధంగా యూనిఫామ్ లు వితరణ చేసిన మిత్ర బృందం సభ్యులు చెరుకూరి శేఖర్ బాబు, మందలపు వెంకటేశ్వర్లు, మేకల రాంబాబు, కొర్ర చీన, లాల్చంద్, ప్రసాద్, నామా సతీష్, ఎం వెంకటేశ్వర్లు, రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు, యాదగిరి, రామేశ్వరి, ఈరు, భీము, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.



# పీడీయస్యూ రాష్ట్ర 23వ మహాసభలు విజయవంతంగా ముగింపు

- మహాసభల్లో నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక
- రాష్ట్ర అధ్యక్షులుగా కంపాటి పృథ్వీ,ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ ఎన్నిక




**ఖమ్మం, విశాలభారతి:**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర 23వ మహాసభలు ఖమ్మం నగరంలోని జార్జ్ రెడ్డి నగర్, భక్త రామదాసు కళాక్షేత్రంలో మూడు రోజుల పాటు (జనవరి 23, 24, 25) అత్యంత ఉత్సాహభరితంగా, విజయవంతంగా ముగిశాయి.ఈ మహాసభల్లో రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు, యువకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణ-కమర్షియలైజేషన్ దాడులు, ఫీజుల భారం, నిరుద్యోగం వంటి సమస్యలపై విస్తృతంగా చర్చ జరిగింది. విద్య హక్కును కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని మహాసభ పిలుపునిచ్చింది.బహిరంగ సభ,విద్యా గోష్టి ,సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో చైతన్యాన్ని రగిలించాయి అని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను కొనసాగించాలనే సంకల్పాన్ని మహాసభ ప్రకటించింది. ఈ మహాసభల్లో నూతన రాష్ట్ర నాయకత్వాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.భవిష్యత్ కార్యాచరణ,ప్రణాళికను ఆమోదించుకోవడం జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శులు వంగూరి వెంకటేష్ ,సురేష్ కామారెడ్డి,డాక్టర్ కర్నా గణేష్ నిజామాబాద్, బోయినపల్లి అజయ్ వరంగల్ హన్మకొండ,వీరభద్రం భద్రాద్రి కొత్తగూడెం. కోశాధికారి: అంగిడి కుమార్ కరీంనగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు: హరీష్,నాగరాజు,చైతన్య హైదరాబాద్, సీతారాం, మారుతి,మహబూబ్ నగర్, వెంకటేష్,మహేష్ నారాయణపేట,దినేష్ వనపర్తి,హరీష్ గద్వాల,అఖిల్ నిజామాబాద్,స్పందన,శ్రవణ్ భద్రాద్రి కొత్తగూడెం, టి.లక్ష్మణ్, శశి కిరణ్ ఖమ్మం,బాలకృష్ణ,వినయ్,వి. కావ్య, పి.అనూష, వరంగల్‌హన్మకొండ అనిల్,అషూర్,నిజామాబాద్,హర్ష వర్ధన్ నల్గొండ,చందర్ రావు సూర్యాపేట,సిద్దిపేట మధుసూదన్,వినోద్ ఆదిలాబాద్,బొట్ల గౌతమ్ మహబూబాబాద్,రాందాస్ కామారెడ్డి,నిర్మల్ కిరణ్,తుర్రం నవీన్ లతో పాటు 2 కో ఆప్షన్స్ ఇవ్వడం జరిగింది. ఈ మహాసభల్లో విద్య, ఉద్యోగాలు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమం లో పీడీఎస్ యూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారావు నరేందర్ శివ సహాయ కార్యదర్శులు వెంకటేష్, వీరబాద్రం రాష్ట్ర నాయకులు లక్ష్మణ్, శశి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అవార్డులతో మెరిసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల

**పాల్వంచ, విశాలభారతి:**



77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), పాల్వంచకు జిల్లా స్థాయిలో నాలుగు ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయి. కళాశాలలోని అధ్యాపకులు మరియు సిబ్బంది వివిధ విభాగాల్లో అందించిన విశేష సేవలను గుర్తించి ఈ అవార్డులు ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మకి ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు లభించగా, విజయ్ ప్రసాద్ కి ఉత్తమ సూపరిండెంట్, ఉత్తమ లైబ్రేరియన్ గా డాక్టర్ బి. కొండలరావు, ఉత్తమ అధ్యాపకులు గా డాక్టర్ వేముల కామేశ్వరరావు లకు అవార్డు లభించాయి. అదేవిధంగా కళాశాలకు చెందిన విద్యార్థులకు కూడా వ్యాసరచన మరియు వకృత్వ పోటీలలో మొదటి మరియు రెండవ బహుమతులు రావడం జరిగింది. వ్యాసరచన పోటీలో బీకాం విద్యార్థి జీవన్ కు మొదటి బహుమతి, ఆయేషా బి జెడ్ సి తృతీయ సంవత్సరం విద్యార్థికి రెండవ బహుమతి లభించగా, వకృత్వ పోటీల్లో వినయ్ తేజ కు మొదటి బహుమతి నస్రిన్ కు రెండో బహుమతి రావడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు.ఈ అవార్డులు, ప్రశంసాపత్రాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ గారు తమ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం మాట్లాడుతూ, ఈ విజయాలు కళాశాల అధ్యాపకులు మరియు సిబ్బంది సమిష్టి కృషికి నిదర్శనమని పేర్కొంది. అవార్డు గ్రహీతలను కళాశాల అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది హృదయపూర్వకంగా అభినందించి, కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఘనంగా 77 గణతంత్ర దినోత్సవ వేడుకలు



**జెండా ఆవిష్కరణ చేసిన కాలనీ అధ్యక్షులు చిన్నం గణేష్**

**బోడుప్పల్, విశాలభారతి:**

భారత 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం దేవేందర్ నగర్ కాలనీ ఫేస్ టు లో ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు చిన్నం గణేష్ జాతీయ జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 13వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జన్న రాజు, దేవేందర్ నగర్ కాలనీ అధ్యక్షులు దయ్యాల మహేష్ పాల్గొనడం జరిగింది. అనంతరం కాలనీ అధ్యక్షులు చిన్నం గణేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ భారత రాజ్యంగం ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యంగామని భారత రాజ్యాంగం ద్వారా అన్ని వర్గాలకు సమాజిక న్యాయం జరుగుతుందని రాజ్యంగా ఫలాలు అన్ని వర్గాలకు అందేలా చూడాలని సూచించారు. ఈ యొక్క కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బైరుగొండ మల్లేష్, కాలనీ ప్రధాన కార్యదర్శి బైరు మధు, కోశాధికారి పారుపల్లి సోమనరసింహ, ముఖ్య సలహాదారులు సత్తయ్య, ఉపాధ్యక్షులు తునికి సుధాకర్, ఉప కోశాధికారి దడిగ భాస్కర్, మల్యాల రాజశేఖర్, జోగు సుధాకర్, కాటం స్వామి,టిడిపి నాయకులు వెంకటేష్,కొలుపుల సోమయ్య, జన్న నాగరాజు, ప్రశాంత్, కార్యవర్గ సభ్యులు కంకల హరిబాబు, ఎర్ర బచ్చల బాలు, బర్ల మహేష్, వెంకటేష్, బొంగు మల్లేష్ యాదవ్, చిన్నం రాములు,నకిర్త సోమేశ్,కేమిడి నాగరాజు, రాజు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## దేవరుప్పుల మండల పాఠశాలలకు తొమ్మిది అవార్డులు



**దేవరుప్పుల, విశాలభారతి:**

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా అధికారులు పలు విభాగాలలో ఉత్తమ సేవలకు అవార్డులు అందించారు. అందులో విద్యా శాఖకు సంబంధించి దేవరుప్పుల మండలంలోని పాఠశాలలకు మొత్తం తొమ్మిది అవార్డు లభించాయి. జనగామ జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా రూపొందించిన దిక్సూచి కార్యక్రమంలో ఉత్తమంగా నిలిచినందుకు జెడ్పిహెచ్ఎస్ చిన్నమడూర్, జడ్పిహెచ్ఎస్ కడవెండి, ఎంపీపీఎస్ మాధపురం, ఎంపీపీ ఎస్ పెద్ద మడూరు పాఠశాలలు అవార్డులకు ఎంపికయ్యాయి. ఆ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు జి. కళావతి, ఎన్.ఎన్. రాజు, ఎన్. లలిత, ఎం. పద్మారాణి కలెక్టర్ మరియు అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం పొందారు. విద్యాశాఖలో బెస్ట్ ఎంప్లాయిస్ అవార్డును జెడ్ పి హెచ్ ఎస్ కామారెడ్డి గూడెం ప్రధానోపాధ్యాయుడు జె. రాజేంద్ర కుమార్, సిఆర్పి బి. యాక స్వామి అందుకున్నారు. స్వచ్ఛ హరిత ఏవం విద్యాలయ రేటింగ్ విభాగంలో మొండి చింత తండా పాఠశాల ఎంపికైంది. ప్రధానోపాధ్యాయుడు పి. వీరారెడ్డి జిల్లా మరియు రాష్ట్ర స్థాయి పురస్కారం పొందారు. 600 మొక్కలు నాటి సంరక్షించిన కారణంగా జెడ్పిహెచ్ఎస్ సింగరాజుపల్లి పాఠశాలకు అవార్డు లభించింది. ప్రధానోపాధ్యాయురాలు ఎ. సుచిత్రానంద్ అవార్డు అందుకున్నారు. జిపి ఎలక్షన్స్ సందర్భంలో ఉత్తమ రిసోర్స్ పర్సన్ గా ఎంపీయుపిఎస్ అప్పిరెడ్డిపల్లి పాఠశాలకు చెందిన జి. తిరుపతిరెడ్డికి అవార్డు లభించింది. ఈ తొమ్మిది పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు జనగామ లోని మినీ స్టేడియంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొని అవార్డులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ డా. జి. కళావతి మాట్లాడుతూ, దేవరుప్పుల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం కృషి చేయడంలో ప్రత్యేక కృషి చేస్తున్నారని, కొన్ని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు అమలవుతున్నాయని, తొమ్మిది అవార్డులు పాఠశాలలకు లభించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. అవార్డు పొందిన పాఠశాలలవారందరికీ శుభాకాంక్షలు చెబుతూ ఈ స్ఫూర్తితో పాఠశాలల అభివృద్ధి కొరకు మరింత అంకిత భావంతో పనిచేయగలమని అన్నారు. ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఉపాధ్యాయులు సుమతి, అరుణోదయ, సురేష్ బాబు, రజనీకాంత్, సరిత, రంజిత్ రావ్, నీరజ, మోహన్, రాజయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్ జీ, నీహారిక, ప్రవీణ, నిరంజని, శ్రీదేవి, శారద, సునీత, వెంకన్న, సత్యనారాయణ, రోజా, సుర్జీత్, జీవన్, శంకర్, నరసింహ నాయక్, శైలజ మరియు ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఐజెయు ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే వేడుకలు



**ఖమ్మం, విశాలభారతి:** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఖమ్మం ప్రెస్ క్లబ్ లో టియుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ప్రధాన కార్యదర్శి మైసా పాపారావు హాజరై మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ఇచ్చిన స్ఫూర్తితో జర్నలిస్టుల హక్కుల సాధనకు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రపంచంలోకెల్లా అతి పెద్దదైన భారత రాజ్యాంగం ఇతర ప్రజాస్వామిక దేశాలకు ఆదర్శవంతంగా నిలిచిందన్నారు. మహనీయుల చూపిన బాటలో అందరూ పయనించాలని కోరారు. తొలుత ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం జెండా ఆవిష్కరణ గావించారు . ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే ఐజేయు యూనియన్ జిల్లా కోశాధికారి నాగండ్ల శివానంద, సీనియర్ నాయకులు మొహిద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి సత్యనారాయణ, నగర కోశాధికారి ఏలూరి వేణు,యూనియన్ నాయకులు మేడి రమేష్, శివాజీ, రామారావు,కోట అశోక్ రాజా, నాగేశ్వరరావు, మంద వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 100 మీటర్ల జాతీయ పతాకంతో భారీ ర్యాలీ




**పాల్వంచ విశాలభారతి:** స్థానిక పాల్వంచలోని ఆదర్శ ఇంటిగ్రేట్ మోడల్ స్కూల్ విద్యార్థులు 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 100 మీటర్ల భారీ జాతీయ పతకంతో పాల్వంచలోని వీధుల్లో వివిధ రకాల దేశ నాయకుల చిత్రపటాలతో 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు చేసినటువంటి ర్యాలీ పాల్వంచ వీధుల్లో ఎంతో ఆకర్షణగా నిలిచింది అనంతరం గణతంత్ర దినోత్సవ యొక్క గొప్పతనం గురించి పాఠశాల ప్రిన్సిపాల్ రెంటాల నాగభూషణం విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇటువంటి ర్యాలీలు నిర్వహించడం ద్వారా పిల్లలకు దేశభక్తి పెంపొంజుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ రెంటాల టాల నాగభూషణం తెలియజేశారు.

## స్టెల్లామేరి స్కూల్లో గణతంత్ర దినోత్సవం

- రిపబ్లిక్ డే అంటే రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు
- మనల్ని పాలించే రాజులను మనమే ఎన్నుకోవడం
- ప్రిన్సిపల్ సిస్టర్ సుమలత



**బూర్గంపాడు, విశాలభారతి :** మొరంపల్లి బంజార స్టెల్లా మెరిస్కూల్ నందు గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫాదర్ జాన్స్. స్కూల్ సిబ్బందికి,విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.గణతంత్ర దినోత్సవానికి మరియు స్వాతంత్ర దినోత్సవానికి గల తేడాలను విద్యార్థులకు వివరించారు. ఇండిపెండెన్స్ డే అంటే స్వాతంత్రం వచ్చిన రోజు 1947 ఆగస్టు 15న మన దేశం బ్రిటిష్ వాళ్ళ నుండి విముక్తి పొందిన రోజు. కాబట్టి ఆగస్టు 15ను స్వాతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాం. రిపబ్లిక్ డే అంటే రాజ్యాంగం అమల్లోకి వచ్చిన రోజు 1950 జనవరి 26న అమల్లోకి రావడంతో జనవరి 26ను రిపబ్లిక్ డే గా జరుపుకుంటామని సూచించారు. ఆగస్ట్ 15న ప్రధానమంత్రి ఎర్రకోటపై జెండాను ఎగరవేస్తారని, జనవరి 26 రోజున రాష్ట్రపతి రాజ్ పత్ లో జండా ఎగరేయడం జరుగుతుందని తెలిపారు. తదుపరి స్కూల్ ప్రిన్సిపల్ సుమలత ప్రసంగిస్తూ విద్యార్థులకు 'గణం 'అంటే ప్రజలని 'తంత్ర 'అంటే ఎన్నుకోవడం. మనం పాలించే రాజులను మనమే ఎన్నుకోవడం అని అన్నారు. రిపబ్లిక్ డే అంటే రాజ్యాంగం అమలుపరిచిన రోజు కాబట్టి జనవరి 26 రిపబ్లిక్ డే జరుపుకోవడం జరుగుతుందని సూచించి విద్యార్థులకు, స్కూల్ సిబ్బంది కి మిఠాయి అందజేశారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యేలు కుంభం, బీర్ల ఐలయ్య



**వలిగొండ , విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య , భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ హనుమంతరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి అందిస్తున్న బ్యాటరీ వాహనాలు, ఎలక్ట్రికల్ వీల్‌చైర్లు, స్కూటీలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇప్పుడు అందరూ జాతీయ నటులే!

ఈ సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో తెలుగు ప్రేక్షకులను పలకరించింది కన్నడభామ అషిక రంగనాథ్. ఈ ఏడాదే మెగాస్టార్ 'విశ్వంభర'తో ఈ అందాలరాశి మరోసారి తెలుగు తెరపై మెరవనున్నది. తాజాగా శర్వానంద్, శ్రీను వైట్ల కాంబినేషన్‌లో రూపొందనున్న సినిమాలో కూడా కథానాయికగా ఎంపికైంది అషికా రంగనాథ్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అషికా మాట్లాడుతూ 'ప్రస్తుతం ఏ భాషలో సినిమా తీసినా దేశమంతా చూస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒకేభాషకు పరిమితం కావాలన్నా కాలేం. కళాకారులకు ఎల్లలు తెగిపోయాయి. ఈ పానిండియా యుగంలో అందరూ జాతీయ నటులే. ఇది ఓ విధంగా మంచి పరిణామం. అందుకే భాషతో పట్టింపు లేకుండా సినిమాలకు సంతకాలు చేస్తున్నాను.' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్. ఇంకా చెబుతూ 'కార్తీతో నేను చేసిన 'సర్దార్ 2' ఈ సమ్మర్‌లోనే రానుంది. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. నటిగా నన్ను మరోస్థాయిలో నిలబెట్టే సినిమా అది. ఈ సినిమాకోసం ఎదురు చూస్తున్నా.' అని తెలిపింది అషికా రంగనాథ్.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.